ప్రసారం చేయబడిన మరియు పంపిణీ చేయబడిన శుక్రవారం ఖుత్బా

తేదీ: 24 సఫర్ 1448 హిజ్రీ (ఆగస్టు 7, 2026 క్రీ.శ)

# عِبَادَةُ الشُّكْرِ

# కృతజ్ఞతా ఆరాధన

ఇన్నల్ హమ్ద లిల్లాహి, నహ్మదుహు వనస్తఈనుహు వనస్తగ్ఫిరుహ్, వనవూజు బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా వమిన్ సయ్యిఆతి అఅ్మాలినా, మన్ యహ్దిహిల్లాహు ఫలా ముజిల్ల లహ్, వమన్ యుజ్లిల్ ఫలా హాదియ లహ్, వఅష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లా షరీక లహ్, వఅష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వరసూలుహ్, వసఫియ్యుహు మిన్ ఖల్ఖిహీ వఖలీలుహ్, అద్దల్ అమానత, వబల్లఘర్ రిసాలత, వజాహద ఫిల్లాహి హఖ్ఖ జిహాదిహీ, హత్తా అతహుల్ యఖీన్, సల్లల్లాహు అలైహి వసల్లమ వఅలా ఆలిహీ వసహ్బిహీ వసల్లమ తస్లీమన్ కసీరా; {యా అయ్యుహల్లజీన ఆమనుత్తఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహీ వలా తమూతున్న ఇల్లా వఅంతుమ్ ముస్లిమూన్}

**అమ్మా బాద్:**

నిశ్చయంగా మాటల్లో అత్యంత సత్యమైనది అల్లాహ్ గ్రంథం (ఖురాన్). అత్యుత్తమ మార్గం ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపిన మార్గం. కార్యాలలో అత్యంత చెడ్డవి (ధర్మంలో) క్రొత్తగా కల్పించబడినవి. ప్రతి క్రొత్త కల్పన ఒక బిద్అత్ (అపమార్గం). ప్రతి బిద్అత్ దారిమళ్లించేది, మరియు ప్రతి అపమార్గం నరకాగ్నిలోకి తీసుకెళ్లేది.

అల్లాహ్ దాసులారా! ఆరాధనల్లో అత్యున్నతమైన స్థానం 'కృతజ్ఞత'. ఇది అత్యంత ఘనమైన ఆరాధన మరియు అల్లాహ్ మీప్యాన్ని మనకు అందించే అత్యంత గొప్ప సత్కార్యం. అల్లాహ్ కృతజ్ఞత తెలిపే వారిని కొనియాడాడు, మరియు తన సృష్టిలో అత్యంత ప్రత్యేకమైన వారి లక్షణంగా దీనిని వర్ణించాడు.

తన ప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّهُ كَانَ عَبْدًا شَكُورًا

"నిశ్చయంగా ఆయన అత్యంత కృతజ్ఞత కలిగిన దాసుడు." (సూరా అల్-ఇస్రా: 3)

మరియు తన మిత్రుడు ఇబ్రాహీం (అలైహిస్సలాం) గురించి అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు:

إِنَّ إِبْرَاهِيمَ كَانَ أُمَّةً قَانِتًا لِلَّهِ حَنِيفًا وَلَمْ يَكُ مِنَ الْمُشْرِكِينَ (120) شَاكِرًا لِأَنْعُمِهِ اجْتَبَاهُ وَهَدَاهُ إِلَى صِرَاطٍ مُسْتَقِيمٍ

ఇబ్రాహీం (యావత్సమాజానికి) గొప్ప నాయకుడు. అల్లాహ్  పట్ల పూర్తి విధేయతతో కూడిన అంకితభావంగల భక్తుడు. అతను ఏనాడూ దైవేతరశక్తుల్ని ఆరాధించినవాడు కాదు. అదీగాక దేవుడు చేసిన మహోపకారాల పట్ల ఆయనకు సదా కృతజ్ఞుడయి ఉండేవాడు. (అంచేత) దేవుడు అతడ్ని ప్రత్యేకంగా ఎన్నుకొని రుజుమార్గం చూపాడు. (సూరా అన్-నహ్ల్: 120-121)

సులైమాన్ అలైహిస్సలాం) తనపై అల్లాహ్ కురిపించిన వరాలను చూసినప్పుడు ఇలా అన్నారు:

قَالَ هَذَا مِنْ فَضْلِ رَبِّي لِيَبْلُوَنِي أَأَشْكُرُ أَمْ أَكْفُرُ وَمَنْ شَكَرَ فَإِنَّمَا يَشْكُرُ لِنَفْسِهِ وَمَنْ كَفَرَ فَإِنَّ رَبِّي غَنِيٌّ كَرِيمٌ

సులైమాన్ దాన్ని చూసి "ఇది నాప్రభువు అనుగ్రహం. నేను కృతజ్ఞత చూపుతానా లేక అవిశ్వాసవైఖరితో కృతఘ్నుడైపోతానా అని నన్ను పరీక్షించడానికే ఆయన ఇలా చేశాడు. ఎవరైనా కృతజ్ఞత చూపుతున్నాడంటే అది అతనికే లాభదాయకమవుతుంది. కృతఘ్నుడైపోతే (అది అతనికే చేటు). నిశ్చయంగా నాప్రభువు నిరపేక్షాపరుడు దేన్నీ ఖాతరుచేయని వాడు, గొప్ప అనుగ్రహమూర్తి కూడా" అని అన్నాడు. (సూరా అన్-నమ్ల్: 40)

మన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా తన ప్రభువుకు అత్యంత కృతజ్ఞత చెల్లించేవారు. ముఘీరా బిన్ షుఅబా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రాత్రిపూట పాదాలు వాచేంతగా నమాజ్ (తహజ్జుద్) చేసేవారు. "అల్లాహ్ మీ పూర్వ, పర పాపాలన్నింటినీ క్షమించివేశాడు కదా, అయినా మీరు ఇంత శ్రమ పడుతున్నారెందుకు?" అని అడగబడగా, దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సమాధానమిచ్చారు:

«أَفَلَا أَكُونُ عَبْدًا شَكُورًا»

"నేను (నా ప్రభువుకు) కృతజ్ఞత గల దాసుడిగా ఉండకూడదా?" (సహీహ్ అల్-బుఖారీ, సహీహ్ ముస్లిం)

ఓ ముస్లింలారా! అల్లాహ్ మానవులను ఇద్దరిగా విభజించాడు - కృతజ్ఞత తెలిపేవారు మరియు కృతఘ్నులైన వారు. అల్లాహ్ తాలా సెలవిచ్చాడు:

إِنَّا هَدَيْنَاهُ السَّبِيلَ إِمَّا شَاكِرًا وَإِمَّا كَفُورًا

"నిశ్చయంగా మేమే అతనికి మార్గాన్ని చూపించాము; ఇక అతడు కృతజ్ఞుడైనా కావచ్చు లేదా కృతఘ్నుడైనా కావచ్చు." (సూరా అల్-ఇన్సాన్: 3)

తన దాసులలో కృతజ్ఞత చెల్లించేవారు చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారని అల్లాహ్ ఈ విధంగా తెలియజేశాడు:

وَقَلِيلٌ مِنْ عِبَادِيَ الشَّكُورُ

"నా దాసులలో కృతజ్ఞత చెల్లించేవారు చాలా తక్కువ మంది ఉన్నారు." (సూరా సబా: 13)

సృష్టిలోని ఎక్కువ మంది ప్రజలు అల్లాహ్ ప్రసాదించిన అనేక  బాహ్య మరియు అంతర్గత అనుగ్రహాలలో తేలియాడుతుంటారు; అయినప్పటికీ వారిలో కృతజ్ఞత తెలిపేవారు కొందరే, అల్లాహ్‌ను స్మరించేవారు అరుదే! అనుగ్రహం దూరమై, ఆపదలు చుట్టుముట్టినప్పుడు మాత్రమే వారు తమ అశ్రద్ధ  నుండి మేల్కొని, తమ నిర్లక్ష్యానికి పశ్చాత్తాపపడతారు – కానీ ఆ సమయంలో పశ్చాత్తాపపడటం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు.

సన్మార్గం పొందిన దాసుడు ప్రతీ క్షణం తనపై ఉన్న అల్లాహ్ అనుగ్రహాన్ని గుర్తిస్తాడు. అతని హృదయం ప్రభువు కృపను అంగీకరిస్తుంది, అతని నాలుక నిరంతరం ఆయన ధ్యానంతో, కృతజ్ఞతలతో నానుతూ  ఉంటుంది, మరియు అతని అవయవాలు ఆయన ఆజ్ఞలకు విధేయత చూపుతాయి. అల్లాహ్ తాలా సెలవిచ్చాడు:

وَآتَاكُمْ مِنْ كُلِّ مَا سَأَلْتُمُوهُ وَإِنْ تَعُدُّوا نِعْمَتَ اللَّهِ لَا تُحْصُوهَا إِنَّ الْإِنْسَانَ لَظَلُومٌ كَفَّارٌ

"మరియు మీరు అడిగినదంతా ఆయన మీకు ప్రసాదించాడు. అల్లాహ్ అనుగ్రహాలను మీరు లెక్కించాలనుకున్నా లెక్కించలేరు. నిశ్చయంగా మానవుడు తీవ్రమైన అన్యాయకారుడు, కృతఘ్నుడు." (సూరా ఇబ్రాహీం: 34)

తల్ఖ్ బిన్ హబీబ్ (రహిమహుల్లాహ్) ఇలా అన్నారు: "అల్లాహ్ హక్కులు (దాసులు నెరవేర్చలేనంత) బరువైనవి, మరియు అల్లాహ్ అనుగ్రహాలు దాసులు లెక్కించలేనంతఅధికమయినవి. కాబట్టి మీరు ఉదయం పశ్చాత్తాపపడుతూ (తౌబా చేసుకుంటూ) నిద్రలేవండి, సాయంత్రం కూడా తౌబా చేసుకుంటూ   గడపండి."

ఓ ఆశీర్వదించబడినవారలారా! నిశ్చయంగా అల్లాహ్ యొక్క పరిశుద్ధమైన శుభ నామాలలో ఒక పేరు "అష్-షకూర్" (కృతజ్ఞత నంగీకరించేవాడు/ప్రతిఫలమిచ్చేవాడు). ఆయన కొద్దిపాటి సత్కార్యానికి కూడా అత్యధికంగా ప్రసాదిస్తాడు, స్వల్ప కార్యాన్ని కూడా స్వీకరించి దానికి అపారమైన ప్రతిఫలాన్ని ఇస్తాడు. ఒక్క

సత్కార్యానికి పదింతల నుండి ఏడువందల రెట్లు, మరియు అంతకంటే అనేక రెట్ల ప్రతిఫలాన్ని ఇస్తాడు. మహోన్నతుడైన అల్లాహ్ తన "అష్-షకూర్" అనే నామాన్ని తరచుగా "అల్-గఫూర్" (క్షమాశీలుడు) అనే నామంతో జతచేస్తాడు. ఆయన సమస్త పాపాలను క్షమించేవాడు; పాపం ఎంత పెద్దదైనా సరే దానిని క్షమించడం ఆయనకు కష్టమైనదేమీ కాదు. అలాగే ప్రతి చిన్న పనికి కూడా ప్రతిఫలాన్ని ఇచ్చే అష్-షకూర్ ఆయన. ఆశించేవారి ఆశలను భంగపరచని, పనిచేసేవారి శ్రమను వృథా చేయని అల్లాహ్ అత్యంత పవిత్రుడు.

ఓ ముస్లింలారా! ఒక దాసుడు కృతజ్ఞత కలిగిన దాసుడి (అబ్ద్ షకూర్) స్థాయికి చేరుకోవడానికి తోడ్పడే మార్గాలలో మొదటిది: దుఆ (ప్రార్థన).

**1) దుఆ (ప్రార్థన)**

ప్రవక్త సులైమాన్ (అలైహిస్సలాం) ఇలా ప్రార్థించారు:

رَبِّ أَوْزِعْنِي أَنْ أَشْكُرَ نِعْمَتَكَ الَّتِي أَنْعَمْتَ عَلَيَّ وَعَلَى وَالِدَيَّ

“ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేలుకు నేను ఎల్లప్పుడూ నీకు కృతజ్ఞుణ్ణయి ఉంటూ, నీకు నచ్చిన సత్కార్యాలు ఆచరించేలా నన్ను అదుపులో పెట్టు. దయతో నన్ను నీ పుణ్యదాసుల జాబితాలో చేర్చు” అని ప్రార్థించాడు. (సూరా అన్-నమ్ల్: 19)

ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా చేయి పట్టుకుని ఇలా అన్నారు: "ఓ ముఆజ్! అల్లాహ్ సాక్షిగా నేను నిన్ను ప్రేమిస్తున్నాను, అల్లాహ్ సాక్షిగా నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

ఆ తర్వాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు:

«أُوصِيكَ يَا مُعَاذُ، لَا تَدَعَنَّ فِي دُبُرِ كُلِّ صَلَاةٍ تَقُولُ: اللَّهُمَّ أَعِنِّي عَلَى ذِكْرِكَ، وَشُكْرِكَ، وَحُسْنِ عِبَادَتِكَ»

"ఓ ముఆజ్! ప్రతి నమాజ్ ముగింపులో (సలామ్ తర్వాత) ఈ దుఆ చదవడం అస్సలు వదలకు: 'అల్లాహుమ్మ ఐన్నీ అలా జిక్రిక, వషుక్రికి, వహుస్ని ఇబాదతిక్' (ఓ అల్లాహ్! నిన్ను స్మరించడంలో, నీకు కృతజ్ఞత తెలుపుకోవడంలో, మరియు నీ ఆరాధనను చక్కగా నెరవేర్చడంలో నాకు సహాయం చేయి)." (అబూ దావూద్, అల్బానీ దీనిని సహీహ్ అన్నారు)

**2) అల్లాహ్ అనుగ్రహాలను అంగీకరించడం మరియు వాటిని స్మరించడం.**

అల్లాహ్ సెలవిచ్చాడు:

وَإِذْ تَأَذَّنَ رَبُّكُمْ لَئِنْ شَكَرْتُمْ لَأَزِيدَنَّكُمْ وَلَئِنْ كَفَرْتُمْ إِنَّ عَذَابِي لَشَدِيدٌ

"మరియు మీ ప్రభువు ఇలా ప్రకటించిన సందర్భాన్ని గుర్తుచేసుకోండి: 'మీరు గనక కృతజ్ఞత చెల్లిస్తే, నేను మీకు మరిన్ని అనుగ్రహాలను ఇస్తాను; ఒకవేళ కృతఘ్నత చూపితే, నిశ్చయంగా నా శిక్ష చాలా తీవ్రంగా ఉంటుంది'." (సూరా ఇబ్రాహీం: 7)

కృతజ్ఞత కలిగిన మనస్సు అల్లాహ్ దయను గుర్తిస్తుంది, తన సృష్టికర్త యొక్క ఉపకారాన్ని, అనుగ్రహాన్ని ఒప్పుకుంటుంది. తద్వారా అదనపు అనుగ్రహాలను మరియు కృపను పొందుతుంది. అందుకే పూర్వీకులు కృతజ్ఞతను "అల్-హాఫిజ్" (రక్షకభూషణం) అని పిలిచేవారు; ఎందుకంటే ఇది ఉన్న అనుగ్రహాలను కాపాడుతుంది, లేని అనుగ్రహాలు దక్కేలా చేస్తుంది..

3) **అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను ఆయనకు ఇష్టమయిన పనుల్లో ఉపయోగించడం.** కృతజ్ఞత యొక్క అసలు సారాంశం ఏమిటంటే – అల్లాహ్ ఇచ్చిన వరాలను ఆయన ఇష్టపడే కార్యాల్లోనే వినియోగించడం. పూర్వీకులలో ఒకరు ఇలా అన్నారు: "కృతజ్ఞత చూపడం అంటే పాపాలకు దూరంగా ఉండటమే."

**3) ఐహిక విషయాలలో (లౌకిక హోదా, సంపదలో) మీ కంటే దిగువన ఉన్నవారిని చూడటం.**

అబూ హురైరా (రజియల్లాహు అన్హు) రవాణా చేసిన కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

«انْظُرُوا إِلَى مَنْ هُوَ أَسْفَلَ مِنْكُمْ، وَلَا تَنْظُرُوا إِلَى مَنْ هُوَ فَوْقَكُمْ، فَإِنَّهُ أَجْدَرُ أَنْ لَا تَزْدَرُوا نِعْمَةَ اللهِ عَلَيْكُمْ»

"ప్రపంచ విషయాలలో మీ కంటే దిగువన ఉన్నవారి వైపు చూడండి, మీ కంటే పైన ఉన్నవారి వైపు చూడకండి; ఎందుకంటే అలా చేయడం వల్ల మీపై ఉన్న అల్లాహ్ అనుగ్రహాన్ని మీరు తక్కువగా అంచనా వేయకుండా ఉంటారు." (సహీహ్ అల్-బుఖారీ, సహీహ్ ముస్లిం)

అల్లాహ్ నాకూ మరియు మీకు ఈ మహోన్నతమైన ఖురాన్ ద్వారా శుభాలు ప్రసాదించుగాక! మరియు ఇందులో ఉన్న ఆయత్‌లు (సూక్తులు), జ్ఞానయుక్తమైన ఉపదేశం ద్వారా నన్ను, మిమ్మల్ని లబ్ధిదారులను

చేయుగాక! నేను నా ఈ మాట ముగిస్తూ, నా కోసం మరియు మీ కోసం, ప్రతి పాపం నుండి అల్లాహ్‌ను క్షమాపణ వేడుకుంటున్నాను మరియు ఆయన వైపే మారు మనసుతో మళ్లుతున్నాను. కాబట్టి మీరూ ఆయనను క్షమాపణ వేడుకోండి, ఆయన వైపే మారు మనసుతో మళ్ళండి. నిశ్చయంగా ఆయన క్షమాశీలుడు, అత్యంత దయాళువు.

## రెండవ ఖుత్బా

అల్ హమ్దు లిల్లాహి అలా ఇహ్సానిహ్, వష్ షుక్రు లహు అలా తౌఫీఖిహీ వమ్తినానిహ్, వస్ సలాతు వస్ సలాము అలాద్ దాఈ ఇలా రిజ్వానిహ్, ముహమ్మదిబ్ని అబ్దిల్లాహి వఅలా ఆలిహీ వసహ్బిహీ వమన్ సార అలా మిన్హాలిహీ ఇలా యౌమిద్ దీన్.

**అమ్మా బాద్:** అల్లాహ్ దాసులారా! మీరు అల్లాహ్‌కు భయపడండి (సత్యమైన రీతిలో తఖ్వా వహించండి). ఏకాంతంలో మరియు బహిరంగ సంభాషణలలో ఆయన మిమ్మల్ని చూస్తున్నాడనే స్పృహ కలిగి ఉండండి. మరియు మీరందరూ ఆయన వైపే మరలింపబడతారని తెలుసుకోండి.

ఓ ముస్లింలారా! అల్లాహ్ మనపై కురిపించిన అత్యంత గొప్ప అనుగ్రహాలలో నీటి అనుగ్రహం ఒకటి. ఇది ఎలాంటి శ్రమ, కష్టం లేకుండా మనకు సులభంగా లభిస్తోంది. కానీ లోకంలో ఎంతోమంది తాగునీటి కోసం – అది తాగడానికి యోగ్యమైనదా కాదా అనే దానితో సంబంధం లేకుండా – కేవలం నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణించే పరిస్థితి ఉంది.

ఈ అనుగ్రహాన్ని గుర్తుచేస్తూ అల్లాహ్ తాలా ఇలా సెలవిచ్చాడు:

قُلْ أَرَأَيْتُمْ إِنْ أَصْبَحَ مَاؤُكُمْ غَوْرًا فَمَنْ يَأْتِيكُمْ بِمَاءٍ مَعِينٍ

"వారికి చెప్పు: 'ఒకవేళ మీ నీరంతా భూమి పొరల్లోకి ఇంకిపోతే, మీకు ప్రవహించే మంచి నీటిని తెచ్చి ఇచ్చేదెవరో ఆలోచించారా?'" (సూరా అల్-ముల్క్: 30)

కృతజ్ఞత పరిపూర్ణం అవ్వాలంటే దాసుడు ఈ అనుగ్రహాన్ని సరిగ్గా (పొదుపుగా) వినియోగించాలి మరియు నీటిని వృథా చేయకూడదు. మన స్వచ్ఛమైన ఇస్లాం ధర్మం దానం (సదఖా) మరియు వుజూ విషయంలో కూడా దుబారా చేయడాన్ని నిషేధించింది – ఇవి రెండూ ఆరాధనలు (ఇబాదత్‌లు) అయినప్పటికీ వృథాను

నివారించమంటే, ఇక ఇతర లౌకిక విషయాలలో వృథా చేయడం ఎంతవరకు తప్పు?! అల్లాహ్ తాలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ إِذَا أَنْفَقُوا لَمْ يُسْرِفُوا وَلَمْ يَقْتُرُوا وَكَانَ بَيْنَ ذَلِكَ قَوَامًا

వారు తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చుచేయరు; ఇటు పిసినారి తనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండు అతిచర్యలకు మధ్యస్తంగా ఉంటుంది. (సూరా అల్–ఫుర్ఖాన్: 67)

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర (రజియల్లాహు అన్హుమా) కథనం ప్రకారం, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రతి అవయవాన్ని మూడేసి సార్లు కడుగుతూ వుజూ చేశారు. ఆ తర్వాత ఇలా సెలవిచ్చారు:

«هَكَذَا الْوُضُوءُ، فَمَنْ زَادَ عَلَى هَذَا فَقَدْ أَسَاءَ، وَتَعَدَّى، وَظَلَمَ»

"వుజూ చేసే పద్ధతి ఇది. ఎవరైనా దీని కంటే ఎక్కువ చేస్తే (మూడు సార్ల కంటే ఎక్కువ కడిగితే), వారు తప్పు చేసినట్లే, హద్దు మీరినట్లే మరియు అన్యాయం చేసినట్లే." (అహ్మద్, నసాయీ; అల్బానీ దీనిని సహీహ్ అన్నారు)

ఓ విశ్వసించినవారలారా! ఈ ఇటీవలి శతాబ్దాలలో అల్లాహ్ మనకు ప్రసాదించిన అత్యంత ప్రాముఖ్యమైన అనుగ్రహాలలో విద్యుత్ (కరెంట్) అనుగ్రహం ఒకటి. దీని ద్వారా ఇళ్లు వెలుగుతాయి, ఆహార పదార్థాలు భద్రపరచబడతాయి, జీవిత చక్రం నడుస్తుంది, సమాచార సాధనాలు పనిచేస్తాయి మరియు వేసవి తీవ్రమైన ఎండల తాపం తగ్గుతుంది. రాత్రి లేదా పగలు ఒక గంట పాటు విద్యుత్ నిలిచిపోతే, జీవితమే స్తంభించిపోయిందని, సర్వమూ ఆగిపోయిందని మనకు అనిపిస్తుంది. దాసుడు ఒక అనుగ్రహానికి అలవాటుపడినప్పుడు దాని విలువ అతనికి తగ్గవచ్చు, కానీ అది దూరమైనప్పుడే దాని నిజమైన విలువ తెలుస్తుంది.

విద్యుత్ శక్తి పట్ల నిర్లక్ష్యం వహించడం, పగలు రాత్రి తేడా లేకుండా అనవసరంగా లైట్లు, ఫ్యాన్లు తిరుగుతున్నా పట్టించుకోకపోవడం కూడా నిందింపబడిన వృథా (ఇస్రాఫ్) కిందకే వస్తుంది.

ముఘీరా బిన్ షుఅబా (రజియల్లాహు అన్హు) రవాణా చేసిన హదీస్ ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

«إِنَّ اللهَ كَرِهَ لَكُمْ ثَلَاثًا: قِيلَ وَقَالَ، وَإِضَاعَةَ الْمَالِ، وَكَثْرَةَ السُّؤَالِ»

"నిశ్చయంగా అల్లాహ్ మీలో మూడు విషయాలను అసహ్యించుకున్నాడు: 1. పనికిరాని మాటలు/కబుర్లు 2. ధనాన్ని వృథా చేయడం, 3. ఎక్కువగా (అనవసరంగా) ప్రశ్నించడం/అడగడం." (సహీహ్ అల్-బుఖారీ, సహీహ్ ముస్లిం)

ఓ అల్లాహ్! మాకు ఈమాన్ (విశ్వాసం) పై ప్రేమను కలిగించు, దానిని మా హృదయాలలో అందంగా దిద్ది తీర్చు. మరియు కుఫ్ర్(అవిశ్వాసం), పాపాలు, ఆజ్ఞాతిరస్కారాల పట్ల మాలో అసహ్యాని కలిగించు. మమ్మల్ని సన్మార్గంలో నడిచేవారిలో చేర్చు.

ఓ అల్లాహ్! ఇస్లాంను మరియు ముస్లింలను శక్తివంతం చేయి. షిర్క్ (బహుదేవారాధన) ను, బహుదేవారాధకులను హీనపరచు.

ఓ అల్లాహ్! కువైట్‌ను, దాని ప్రజలను సమస్త కీడుల నుండి, ఆపదల నుండి కాపాడు. ఈ నగరాన్ని మరియు సమస్త ముస్లిం దేశాలను శాంతియుతంగా, సురక్షితంగా ఉంచు.

ఓ అల్లాహ్! ఈ దేశ భద్రత కోసం శ్రమిస్తున్న మా సోదరులను (రక్షణ దళాలను) కాపాడు, వారి పాదాలను స్థిరపరచు.

ఓ అల్లాహ్! మా అమీర్‌ను, వారి వారసుడిని (యువరాజును) నీవు ఇష్టపడే మరియు ప్రసన్నుడయ్యే కార్యాల వైపునకు నడిపించు. వారిని సత్కార్యాలు, భయభక్తుల (తఖ్వా) వైపునకు తీసుకెళ్లు.

**మరియు మా చివరి ప్రార్థన: సమస్త స్తోత్రాలు సర్వలోకాల ప్రభువైన అల్లాహ్‌కే చెల్లును.**